9440662699 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2016-18




# రాజధాని వార్తలు

Voice of Voiceless

PLCB డెవలపర్స్
రాజధాని అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారముల కొరకు సంప్రదించండి
9676844442

అమరావతి సంపుటి : 3 సంచిక 14, పేజీలు 4 రూ. 2/- ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక డిసెంబర్ సోమవారం 25- ఆదివారం 31, 2017




# ఇక్కడ గుడే బడి

- బడిస్థలం పంచాయతీ స్వాధీనం
- నిధులు మంజూరు చేయని అధికారులు

**సీతంపల్లి (కృష్ణాజిల్లా) :** కైకలూరు మండలంలోని సీతంపల్లి గ్రామంలోని దళిత కాలనీలో కులానికి, మతానికి సంబంధం లేకుండా దేవుని మందిరంలోనే 25 మంది విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠాలను నేర్చుకుంటున్నారు. రెండు విద్యాసంవత్సరాల నుంచి ఇదే తంతు జరుగుతోంది. పాఠశాల విద్యార్థుల్లో 18 మంది బాలికలు కూడా ఉన్నారు. 2016లో రాష్ట్ర ప్రభుత్వం ఎంపీపీ పాఠశాలను ఏర్పాటు చేసింది. చర్చిలో పెళ్లిళ్లు, ప్రత్యేక ప్రార్థనలు ఉన్నప్పుడు మాత్రం క్లాసులను చర్చిబయట నిర్వహిస్తారు. హాజరుపట్టికతో సహా స్కూలు డాక్యుమెంట్లు,ఇతర ముఖ్య పత్రాలన్నీ చర్చిలోని పెళ్లికుమారుడి గదిలో ఉంచుతున్నారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన అన్ని వస్తువులు, పాత్రలను కూడా అక్కడే పెడుతున్నామని ఎంపీపీ స్కూలు ఉపాధ్యాయుడు వి. శ్రీనివాసరావుతెలిపారు. ఈ పాఠశాలలో ఆయనతోపాటు మరొక ఉపాధ్యాయుడు చంద్రమోహన్ పనిచేస్తున్నారు. భవన నిర్మాణం నిమిత్తం 7 సెంట్ల పాఠశాల స్థలాన్ని రెండేళ్ల క్రితమే పంచాయతీకి అప్పగించినట్లు కైకలూరు మండల విద్యాధికారి డి.



రామారావు తెలిపారు. అయినప్పటికీ సర్వశిక్షాఅభియాన్ (ఎస్ఎస్ఏ) ఇంతవరకు నిధులు మంజూరు చేయలేదని ఆయన వాపోయారు. సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. నిధుల కొరత కారణంగా భవన నిర్మాణాలు జరపలేకపోతున్నామని జిల్లా ఎస్ఎస్ఏ అధికారి కేడీవీఎం ప్రసాదు బాబు తెలిపారు. తన టేబుల్‌పైకి పాఠశాల భవనం నిమిత్తం ఫైలు వచ్చిన విషయం కూడా తనకు తెలియదనడం కొసమెరుపు.

27న నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ సదస్సుకు రానున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్.



క్రిస్మస్ శుభాకాంక్షలు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం లిమిటెడ్
(రిజిష్టర్ నెం.AMC/KNA/DCO/2016/122, తేదీ :20-09-2016)
ఫోన్ : 0866-2452129,
email : housing.emp@gmail.com
డోర్ నెం.54-16-3/3, ప్లాట్ నెం.48,
రోడ్డు నెం.3, లయోలా గార్డెన్స్,లయోలా కాలేజి ఎదురు.
విజయవాడ- 520 008. కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్

## పిల్లల ఆరోగ్యానికి పేదరికమే అడ్డంకి

### పారిశుద్ధ్యలేమితో 26 శాతం మంది విద్యార్థినుల గైర్హాజరు




**రాజధాని ప్రతినిధి, విజయవాడ :** అణగారిన వర్గాల నుంచి అధికసంఖ్యలో విద్యార్థులు విద్యకు దూరం కావడానికి కారణం పేదరికంతో వచ్చే అనారోగ్యం, పారిశుద్ధ్యలోపం అని యంగ్ లైవ్స్ సర్వే స్పష్టంచేసింది. 17 శాతం మంది బాలికలు నెలసరి దినాల్లో పాఠశాలలకు వెళ్లకపోవడంతో పాఠ్యాంశాలు అర్థం కావడంలేదని, దీంతో వారికి చదువుపై ఆసక్తి తగ్గిపోయి డ్రాప్ అవుట్స్‌గా మారుతున్నారని నివేదిక తెలిపింది. మరో 26 శాతం మంది విద్యార్థినిలు టాయిలెట్స్ లేని కారణంగా చదువుకు దూరమవుతున్నారని, సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సీఈఎస్ఎస్) అనే స్వచ్ఛంద సంస్థ పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ బాలల పేదరికం- ఆరోగ్యం వర్క్‌షాపులు పాల్గొన్న సీఈఎస్ఎస్ ఈ ఛైర్మన్ ప్రొఫెసర్. ఆర్ రాధాకృష్ణ మాట్లాడుతూ దేశంలోని మూడోవంతు కుటుంబాలకు చెందిన పిల్లలు చాలీచాలని వేతనాల మధ్య పోషకాహార లోపంతో జీవిస్తున్నారన్నారు. దీంతో 25 శాతం పిల్లలు ఎదుగుదల లోపంతోనూ, 23 శాతం బలహీనంగా ఉన్నారన్నారు.

## వరుస సెలవులు

### మళ్లీ కొత్త ఏడాది నుంచే పాలన మధ్యలో ఐదు రోజుల విరామం

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** ప్రస్తుత క్యాలండర్ ఇయర్ వరుస సెలవులతో ముగుస్తోంది. అధికారిక, అనధికారిక సెలవులు వార్షికాంతాన్ని పాలనకు అంతరాయంతో ఇబ్బంది పెడుతున్నాయి. హైదరాబాద్ వెళ్లిపోయిన అనేక మంది ఉద్యోగులు తిరిగి వచ్చే ఏడాది ఒకటో తేదీన విధులకు రానున్నారు. ఈ నెల 23, 24 తేదీలు, 25వ తేదీ క్రిస్‌మస్ కావడంతో సెలవులు వచ్చాయి. 26న బాక్సింగ్ డే రోజు ఆప్షనల్ హాలిడే. అనంతరం 27 నుంచి 29 వరకు పనిదినాలుగా ఉన్నప్పటికీ, వార్షికాంతంలో సెలవులు మురిగి పోతున్నాయని అనేక మంది ఈ మూడు రోజులను కూడా సెలవుగా వినియోగించుకునేందుకు నిర్ణయించారు. ఇలా సెలవులు వినియోగించుకునేందుకు మొగ్గు చూపిస్తున్న వారంతా హైదరాబాద్‌లోని ఉంటూ ఇక్కడ పనిచేస్తున్న వారే కావడం గమనార్హం.

ముస్లిం సోదరులారా ఏకంకండి
వక్ఫ్ ఆస్తులు రక్షించుకుందాం.
వక్ఫ్ ఆస్తులపై మీ వద్ద ఉన్న సమాచారాన్ని మాతో షేర్ చేయండి
- వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ సమితి
wakfsoldiers@gmail.com
76809 94755




## జగన్ నాయకత్వంలో పనిచేస్తా : రాజనాల




**రాజధాని ప్రతినిధి, ఆటోనగర్ :** రైతుబాంధవుడు, అన్నివర్గాల ఆశాజ్యోతి, దివంగత నాయకుడు వైఎస్‌రాజశేఖరరెడ్డి వారసత్వాన్ని అందిపుచ్చుకున్న జగన్ నాయకత్వంలో పనిచేస్తానని ఆటోనగర్ టెక్నికల్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజనాల వెంకటరమణ (బాబ్జి) ప్రకటించారు. ఆయన ఆదేశిస్తే విజయవాడ తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీచేస్తానన్నారు. 2014 నుంచి అనేక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆయన స్థానిక సమస్యలను పరిష్కరించడంలో కూడా ముందున్నానని వివరించారు. రెండోసారి కూడా అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎంపికైన తనకు ఈ ప్రాంతంలోని అన్ని వర్గాలతో స్నేహసంబంధాలు ఉన్నాయన్నారు. ఆటోనగర్ టెక్నీషియన్లలో దాదాపు సగం మంది తూర్పునియోజకవర్గంలో ఉన్నారని, సమీపంలోని 8 నియోజక వర్గాల్లో ఆయన ప్రభావం ఉన్నట్లు స్థానిక వైసీపీ నాయకులు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు డివిజన్ల వారీగా నాయకులను కలుసుకొని పార్టీ పతిష్టతకు పనిచేస్తున్నారన్నారు. విద్యార్థి నాయకుడిగా రాజనాల పనిచేశారని, 1985లో అసెంబ్లీ ఎన్నికల్లో వంగవీటి రంగా గెలుపుకు కృషిచేశారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకునే అనేక సేవాకార్యక్రమాలు నిర్వహించారని స్థానికులు చెబుతున్నారు. రాజన్న మార్గంలో నడిచి జగనన్న ఆకాంక్షలను నెరవేర్చడానికి అలుపెరుగని పోరాటం చేస్తానని రాజనాల వెల్లడించారు.

## ఈవారం రాజధాని

- అమరావతికి ప్రధాన కార్యాలయంగా రానున్న ఇండో యు.కె.హెల్త్ ఇన్‌స్టిట్యూట్
- ఇక నుంచి అమరావతిలోనే 'ఎ.పి.పి.యస్.సి కార్యకలాపాలు
- కృష్ణానదిపై ఇబ్రహీంపట్నం, దాములూరు, కంచికచెర్ల వద్ద మూడు వంతెనలు ప్రతిపాదించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.
- పురసేవ చరవాణి యాప్‌తో సమస్యల పరిష్కారం: విజయవాడ పురపాలక సంఘం






# రాజధాని వార్తలు

కలం

## ఇంతకాలం తిరిగి ఇడ్లీప్లేట్లా ?

ప్రతినెలా ఒకట్రెండురోజులు రాజధాని నిర్మాణాలపై పేపర్లు ప్రముఖంగా ప్రచురించడం సర్వసామాన్యమైపోయింది. ప్రపంచ స్థాయి రాజధాని పేరిట ప్రభుత్వం ప్రతిరోజు సామాన్యులను ఊహలపల్లకిలో ఊరేగిస్తున్నారు. వీటికోసం ముఖ్యమంత్రి, మంత్రులు అధికారులు పెట్టిన ఖర్చుతోటే సమగ్ర రాజధాని వచ్చేది. అత్యుత్తమ రాజధాని పేరుతో ప్రభుత్వ ప్రతినిధులు ఇప్పటివరకు 481 సార్లు సింగపూర్, లండన్, అమెరికాలను చుట్టివచ్చారు. ముఖ్యమంత్రి స్వయంగా 13 సార్లు విదేశాలు వెళ్లి 60రోజులు పైగా గడిపారు. ఐఏఎస్,ఐపీఎస్‌ల నుంచి వివిధ హోదాల్లోని ఉద్యోగుల దాదాపు 204 మంది విదేశాలు వెళ్లగా దానిలో 41 మంది మాత్రమే నివేదికలు ఇచ్చారని ప్రముఖ పత్రికలకు పేర్కొన్నాయి. ఇది చాలదన్నట్లు బాహుబలి విజయవంతం కావడంతో సీఎం ఆ సినిమా దర్శకుడు రాజమౌళిని రాజధానిపై సలహాలు అడిగి ప్రజలను విస్తుబోయేలా చేశారు.

ఆసియాలోనే నాలుగో అతిపెద్ద రాజధానికోసం ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.33 వేల కోట్లతో ప్రణాలికలు తయారు చేశారు. 17 లక్షల చదరపు అడుగుల్లో టవర్లు, మ్యూజియాల నిర్మాణాలు ఉంటాయి. ఇందుకోసం హడ్కో నుంచి రూ. 7,500కోట్లు, ప్రపంచ బ్యాంకు నుంచి 500 మిలియన్లు, అప్పుగా తేవాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వ నుంచి రూ.2,500 కోట్లు రావాల్సి ఉండగా ప్రస్తుతానికి రూ. 1,500కోట్ల నిధులను విడుదల చేసింది. రాజధాని నగరంలో ప్రభుత్వ భవనాలతోపాటు 9 రంగాలైన ఆర్థిక, న్యాయ, వైద్య, క్రీడలు, మీడియా, ఎలక్ట్రానిక్స్‌కు కూడా చోటు కల్పిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ప్రస్తుతం ఈ నిర్మాణాల కోసం నార్మన్‌పోస్టర్ ఆకృతులను తయారు చేస్తోంది. హైకోర్టును భవన నిర్మాణాన్ని బుద్దుడి సంస్కృతిలో నిర్మించాలని, అసెంబ్లీని స్థూపాకారంలో,శాసనసభను వజ్రాకారంలో (మనకొల్లూర్‌కు చెందిన కోహినూర్ గుర్తుగా) నిర్మాణాలను చేపట్టాలని, అసెంబ్లీ హాలు గ్రౌండ్ ఫ్లోర్‌లో కూర్చున్న సందర్శకులకు పక్షి ఆకారంలో కనువిందు చేసే ఆకృతిని నిర్మించాలని ప్రభుత్వం తలపోస్తోంది. నిర్మాణాల్లో 51 శాతం పచ్చదనం, 10 శాతం నీటివ్యవస్థలు ఉండే విధంగా చతురస్రాకారంలో భవనాలు నిర్మిస్తారు. నార్మన్‌ఫోస్టర్ పార్టనర్‌లు వీటికి డిజైన్లు సమకూర్చుతుండగా, నార్మన్ పార్టనర్లు, రిలయన్స్ గ్రూప్, హఫీజ్ కాంట్రాక్టర్,ఎన్ఆర్‌డీసీ- ఇండియాలులు భవన నిర్మాణాల్లో పాలుపంచుకుంటాయి. వీరుచాలరన్నట్లు బాహుబలి దర్శకుడు రాజమౌళిని రంగంలోకి దించారు. మంత్రివర్గంతోపాటు ఆయనకూడా లండన్ వెళ్లి నార్మన్ ఫోస్టర్ ఆకృతులను పరిశీలించారు. కొద్దిరోజుల క్రితం ఆసంస్థ విడుదల చేసిన డిజైన్లకు తెలుగుదనం జోడిస్తూ ప్రతిపాదనను ఆయన సీఎం వద్ద ఉంచారు. అసెంబ్లీ చతురస్రాకార భవనంలోని గ్రౌండ్‌ఫ్లోర్‌లో సూర్యకిరణాలు తెలుగుతల్లి విగ్రహం కాలిమీద నుంచి పైవరకు అదీ ఖచ్చితంగా ఉదయం 9.15 వచ్చేవిధంగా రూపొందించాలని ఆయన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇందుకోసం భవనం పై భాగంలో, సూర్య కాంతిని ఒడిసిపట్టే ఓ కటకం దాన్నుంచి వచ్చే పరావర్తన కిరణాలు,తెలుగుతల్లి విగ్రహం బంగారు కాంతులతో మెరిసిపోవడం వంటి సెట్టింగ్‌ను రాజమౌళి రూపొందించారు. సకల చరాచర సృష్టికి ఆధారభూతుడైన సూర్యుడు తెలుగుతల్లి పాదాలను తాకడమా అంటూ నెటిజన్లు ఆయనపై సెటైర్లు వేస్తున్నారు. భారతీయులు మరీ ముఖ్యంగా ఆంధ్రుల భవననిర్మాణ కౌశల్యం హుందాగా, సగౌరవంగా ఉంటుందని నార్మన్‌ఫోస్టర్ రూపొందించిన అసెంబ్లీ భవనం ఇడ్లీ ప్లేట్ల మాదిరిగా ఉందని వాపోతూ, హతవిధీ ఇంతవరకు అన్ని దేశాలు తిరిగి ప్రభుత్వం ఆమోదించింది ఇడ్లీ ప్లేట్లా అంటూ నెటిజన్లు వాట్సప్‌లో సెటైర్లు వేస్తుడటం కొసమెరుపు.

## కొత్త డీజీపీ మాలకొండయ్య?

### సమాచార హక్కు చీఫ్‌గా నందూరి




**రాజధాని ప్రతినిధి, అమరావతి :** రాష్ట్ర కొత్త డీజీపీగా ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గాఉన్న యం. మాలకొండయ్యను నియమించే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకు రాష్ట్ర డీజీపీ నియామకం కేంద్ర ప్రభుత్వం నియమావళికి అనుగుణంగా జరిగేది. ప్రస్తుతం డీజీపీ నండూరి సాంబశివారావును మరో రెండేళ్ళపాటు డీజీపీగా కొనసాగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో సీనియర్ ఐపీఎస్ అధికారిగా ఉన్న మాలకొండయ్యను కొత్త డీజీపీగా నియమించే ఆలోచనలో ముఖ్యమంత్రి ఉన్నట్లు తెలుస్తోంది. మాలకొండయ్య 1985 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి. ఏఎన్‌పీ,ఎస్పీగా, ఏసీబీ జెడీగా, ట్రాన్స్‌కో విజిలెన్స్ జెఎండీగా, అప్పా డైరెక్టర్, ఏసీబీ డీజీగా వివిధ హోదాల్లో పని చేశారు. పదవి రేసులో ఏసీబీ డీజీఆర్‌పి ఠాకూర్ కూడా ఉన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్యానెల్ వెనక్కు రావటంలో ఈయన పాత్ర ఉందని ఐపీఎస్ వర్గాల్లో, అధికార పార్టీలో జోరుగా ప్రచారం సాగింది. అందువల్ల సీఎం ఠాగూర్‌ను డీజీపీగా నియమించేందుకు సుముఖంగా లేరని అధికావర్గాలు చెప్పుకొస్తున్నాయి. దీనికితోడు మాలకొండయ్యను డీజీపీగా నియమిస్తే సీనియారిటీని గౌరంవించినట్లు అవుతుందని తోడు సీఎం భావిస్తున్నట్లు సమాచారం. ఏది ఎమైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం చేసిన చట్ట సవరణతో కొత్త డీజీపీగా మాలకొండయ్య నియమితులయ్యే అవకాశాలు మెరుగుపడ్డాయి.

**సమాచార హక్కు చట్టం చీఫ్ కమిషనర్‌గా నండూరి**


ప్రస్తుత డీజీపీ నండూరి సాంబశివరావు ఈ నెల 31న రిటైర్ కానున్నారు. రెండేళ్ళ పాటు ఈయనను డీజీపీ పదవిలో కొనసాగించాలనుకున్నప్పటికీ నియమావళి పేరుతో కేంద్రం మోకాలడ్డటంతో సాంబశివరావులను రాజ్యాంగబద్ధ సంస్థ సామాచార హక్కు చట్టం చీఫ్ కమిషనర్‌గా నియమిస్తారని తెలుస్తోంది. ఇప్పటికే కమిషనర్ నియామకం ఒకసారి వాయిదాపడింది నెలాఖరులోపు జరగనున్న సమాచార హక్కు కమిషన్ నియామక సమావేశంలో నండూరి నియామకాన్ని ఖరారు చేస్తారని తెలిసింది.



విద్యుత్ వెలుగుల్లో రాయపూడి మెయిన్ రోడ్డులో ఆర్‌సీఎం చర్చి



రాయపూడిలోని లూథరన్ చర్చి



మందడం మెయిన్ బజార్‌లో తెలుగు బాప్టిస్ట్ చర్చి

## ప్రతిష్టాత్మకంగా జన్మభూమి, మా ఊరు

**జనవరి 2 నుంచి 11 వరకు ఐదవ విడత**

**రాజధానిప్రతినిధి,అమరావతి :** ఎన్నికలు సమీపిస్తుండటంతో జన్మభూమి, మాఊరు కార్యక్రమాలను ప్రత్యేకంగా నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనిలో భాగంగా అఖిల భారత సర్వీస్ అధికార్లను రెవెన్యూ డివిజన్లలో నియమిస్తోంది.51 రెవెన్యూ డివిజన్లలో ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులను పర్యవేక్షకులుగా నియమిస్తు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి డివిజన్‌లో ఏ విధమైన సమస్యలు అధికంగా ప్రజలు వెల్లడిస్తున్నారో పరిశీలించి పూర్తిస్థాయి నివేదిక అందించాల్సిన బాధ్యత ఈ అధికారులపై ఉంది. ప్రధానంగా రేషన్ కార్డులు, వృద్దాప్య,వికలాంగ, వితంతు పెన్షన్లు, గృహ నిర్మాణం వంటి సమస్యలు అధికంగా జన్మభూమిలో ప్రభుత్వం దృష్టికి ప్రజలు తీసుకొస్తున్నారు. రేషన్ కార్డులు విషయంలోనే సమస్యలు అధికంగా వస్తుండటంతో పరిష్కారం కోసం యోచిస్తోంది. ఎస్సీ, ఎస్టీ బీసీ సామాజిక వర్గాల అభ్యున్నతికి పెద్దపీట వేసి వారి నుంచి సానుకూలత వచ్చేలా చూడాలని అందుకు జన్మభూమి వేదిక చేసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రణాళిక శాఖ అనుసంధానంగా జన్మభూమిలో విధులు నిర్వహించే అధికార్లు ప్రతిరోజు నివేదికను సమర్పించాల్సి ఉంది. 26 మంది ఐఏఎస్ అధికారులను, 25 మంది ఐఎఫ్ఎస్ అధికారులను రెవెన్యూ డివిజన్లలో నియమించారు. ఇందుకోసం జీఓ ఆర్.టి. నెంబర్ 2872ను సాధారణ పరిపాలన విభాగం జారీ చేసింది. కాగా తొలి విడత జన్మభూమి, మా ఊరు కార్యక్రమాన్ని 2014 అక్టోబర్ 2న నిర్వహించగా, రెండవ విడత జన్మభూమిని 2015 జూన్‌లో నిర్వహించారు. మూడవ విడత జన్మభూమిని 2016 జనవరి లో నిర్వహించగా, నాల్గవ జన్మభూమి కార్యక్రమాన్ని 2017 జనవరిలో నిర్వహించారు. ప్రస్తుతం ఐదవ విడత జన్మభూమి కార్యక్రమాన్ని 2018 జనవరి 2 నుంచి 11 వరకు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## ప్రపంచ పండుగ క్రిస్మస్

**రాజధాని ప్రతినిధి, తుళ్లూరు :** ప్రపంచమంతా జరుపుకునే గొప్ప పండుగ క్రిస్మస అని మంత్రి పత్తిపాటి పుల్లారావు తెలిపారు. తాత, తల్లిదండ్రులను, స్మరించుకుంటూ మాజీ ఎంపీటీసీ, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు జొన్నలగడ్డ కిరణ్ పేదలకు దుస్తుల పంపిణీ, సెమీక్రిస్మస్ వేడుకలను తుళ్లూరులో నిర్వహించారు. దాదాపు 400 మంది పేద వృద్ధులకు కిరణ్ దుస్తులు , స్కూల్ విద్యార్థులకు బ్యాగ్‌లు అందజేశారు. ఎంపీ గల్లా జయదేవ్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే క్రిస్మస్ అంటే తనకు ఇష్టమన్నారు.

**క్రీస్తుమార్గం అనుసరణీయం**

ప్రేమ తత్వాన్ని బోధించి, సర్వమానవాళి సంరక్షణకోసం తన రక్తాన్ని చిందించిన ప్రభువైన క్రీస్తు మార్గం అనుసరణీయమని రాయపూడి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దడిగి సుబ్బారావు తెలిపారు. తుళ్ళూరు మండలం రాయపూడిలోని ప్రాథమిక పాఠశాలలో కేకును కట్‌చేసి ఆయన సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వల్లభాపురపు ప్రసాద్, నుంబూరి సుజాతకుమారి, శేషారత్నం. తాడిబోయిన నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

**చిగురుబాలల గ్రామంలో సెమీక్రిస్మస్ వేడుకలు**

**వెంకటపాలెం(తుళ్ళూరు) :** తుళ్ళూరు మండలం వెంకటపాలెంలోని చిగురు బాలల గ్రామంలో సెమీక్రిస్మస్ వేడుకలు శనివారం నిర్వహించినట్లు నవజీవన్ బాలభవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు బాలశౌరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమానికి విజయవాడ నగర పోలీసు కమిషనర్ గౌతమ్ సవాంగ్, ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ కృష్ణాజిల్లా ప్రాజెక్టు డైరెక్టరు కే. కృష్ణకుమారి, సర్వశిక్షా అభియాన్ కృష్ణాజిల్లా ప్రాజెక్టు అధికారి ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## రాజధానిలో పాలవాగు రగడ

**పూడ్చవద్దంటూ కలెక్టర్‌కు రాయపూడి రైతుల ఫిర్యాదు**

**రాజధాని ప్రతినిధి,తుళ్ళూరు :** రాజధాని ప్రాంతం, తుళ్ళూరు మండలంలోని రాయపూడిలో పాలవాగు పూడ్చివేత వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. రాయపూడి - అబ్బరాజు పాలెం మధ్య ఉన్న పాలవాగును పూడ్చివేసే కార్యక్రమం కొన్ని రోజులుగా సాగుతోంది. పాలవాగు పూడ్చివేత వల్ల ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరదనీరుతో ఇబ్బందులు తలెత్తుతాయని రాయపూడి గ్రామస్థులు అంటున్నారు. ప్రత్యామ్నాయంగా వాగును ఏర్పాటు చేయకుండా ఉన్నదానిని పూడ్చితే పలు అనర్థాలు చోటు చేసుకుంటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజధాని ప్రాంతంలో చెరువులు,వాగులు లాంటివాటిని పూడ్చరాదన్న గ్రీన్‌ట్రిబ్యునల్ నిబంధనలను బేఖాతరు చేస్తున్నారంటూ మండిపడుతున్నారు. తక్షణమే పాలవాగు పూడ్చివేతను నిలిపివేయాలని కోరుతూ ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రాజధాని ప్రాంతంలో కొండవీటివాగుతో పాటు పాలవాగు వ్యవహారం మొదటినుంచీ ఆసక్తికరంగా మారింది. ఈ వాగులవల్ల రాజధానికి వరద ముంపు ఉంటుందని కొంతమంది వాదిస్తుండగా ప్రభుత్వం మాత్రం అదంతా ప్రచారం మాత్రమేనని, రాజధానిని అడ్డుకోవడానికి చూపించే సాకంటూ కొట్టిపారేస్తోంది. రైతులు, గ్రామస్థులు మాత్రం ప్రభుత్వ వాదనను తోసిపుచ్చుతున్నారు.

గిరిజన రైతుకు

## రూ.లక్ష రుణం

**మంత్రి నక్కా ఆనందబాబు**



**రాజధాని ప్రతినిధి,అమరావతి :** రాష్ట్రంలోని గిరిజనుల వ్యవసాయ పెట్టుబడుల కోసం ఎన్ఎస్టీఎఫ్డీసీ ద్వారా రూ.లక్ష రుణం అందిస్తామని, పావలా వడ్డీతో రూ.90 వేల రుణం, కాగా ,రూ.10వేలు లబ్ధిదారులు భరించాల్సి ఉంటుందని రాష్ట్ర సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు తెలిపారు. గురువారం విజ్ఞాన యాత్ర ముగించుకుని సచివాలయ సందర్శన వచ్చిన సీతంపేట, పార్వతీపురం, పాడేరు రంపచోడవరం ఐటీడీఏలకు చెందిన 80 మంది ఔత్సాహిక గిరిజన రైతులతో మంత్రి సమావేశమయ్యారు.విజ్ఞాన యాత్ర వివరాలను గిరిజన రైతులను అడిగి మంత్రి తెలుసుకున్నారు. ప్రతి గిరిజన కులుంబానికి నెలకు రూ.10 వేల ఆదాయం వచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. అటవీహక్కుల చట్టం కింద పెండింగ్‌లో ఉన్న లక్ష ఆర్జీలకు త్వరలో పరిష్కారం చూపనున్నామని, ఈ నెలాఖరులోగా 20 వేల ఆర్జీలను పరిష్కారం చూపి, భూమి హక్కు పత్రాలు ఇవ్వనున్నామని, గిరిజన భూముల్లో బోర్లు వేయడంతో పాటు పెట్టుబడుల కోసం రుణాలు కూడా అందివ్వనున్నామని మంత్రి తెలిపారు.

అటవీహక్కుల చట్టం 2006 ద్వారా నేటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 89,360 మంది గిరిజన రైతులకు 6,60,165 ఎకరాలకు సంబంధించి భూమి హక్కు పత్రాలు అందజేశామన్నారు. అటవీహక్కు చట్టం రాకముందు గిరిజనులపై పెట్టిన కేసుల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి నక్కా ఆనందబాబు తెలిపారు. గిరిజన విద్యార్థులకు కార్పొరేట్ విద్యనందించేలా ప్రభుత్వం మన్యంలో విద్యావ్యవస్థను పటిష్టం చేస్తోందన్నారు. అటవీ, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. విజ్ఞాన యాత్ర ద్వారా తాము తెలుసుకున్న విషయాలను పలువురు గిరిజన రైతులు వివరించారు. తమకు పెట్టుబడులకు రుణాలతో పాటు బోర్లు ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీతంపేట, పార్వతీపురం, పాడేరు. రంపచోడవరం ఐటీడీఏలకు చెందిన 80 మంది గిరిజన రైతులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## రాయపూడి ఎస్సీ కాలనీ వాసులకు చెక్కులు పంపిణీ

**రాజధాని ప్రతినిధి, రాయపూడి,(తుళ్ళూరు) :** రాజధాని నిర్మాణంలో తలమానికమైన సీడ్‌యాక్సిస్ రోడ్డులో గృహాలను కోల్పోతున్న బాధితులకు ఏపీసీఆర్‌డీఏ నష్టపహారంగా రూ.4.17 కోట్లను అందించింది. తుళ్ళూరు. మండలం రాయపూడి ఎస్సీకాలనీ మీదుగా సీడ్ యాక్సిస్ రోడ్డు నిర్మాణం సాగుతోంది. ఇందులో 67 కుటుంబాలకు సంబంధించి గృహాలను కోల్పోతున్నారు. వీరిలో కొంతమందికి రాయపూడి విద్యుత్తు కేంద్రం పక్కన అభివృద్ధి చేసిన ప్లాట్లను పంపిణీ చేశారు. గృహాలను కోల్పోతున్న వారికి నష్టపరిహారంగా రూ.4.17కోట్లను పంపిణీ చేసినట్లు రాయపూడి డిప్యూటీ కలెక్టరు ఉమారాణి తెలిపారు. బాధితులకు గుంటూరు సంయుక్త కలెక్టరు కృతికాశుక్లా ఆదేశాల మేరకు నష్టపరిహారంగా చెక్కులను పంపిణీ చేసినట్లు చెప్పారు.

## జూన్ నాటికి డీఎస్సీ పోస్టింగ్‌లు

**మంత్రి గంటా శ్రీనివాసరావు**

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులకు జూన్ 12 నాటికీ పోస్టింగ్‌లు ఇస్తామని మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. సచివాలయంలో డీఎస్సీ నిర్వహణపై మంత్రి గంటా శ్రీనివాసరావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఖాళీలు, సిలబస్, అర్హతలపై ఏపీపీఎస్సీ చైర్మన్, విద్యాశాఖ ఉన్నతాధికారుతో మంత్రి సుదీర్ఘ చర్చలు జరిపారు. సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని మంత్రి ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చూశారు. నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వరాదని, అభ్యర్థులు పెద్దసంఖ్యలో హాజరుకానుండగా, విద్యాశాఖ సిబ్బంది సేవలను ఉపయోగించుకోవాలని ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయభాస్కర్‌కు సూచించారు. పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించాలా ఏక ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలా అనే అంశాలపై మంత్రి ఆయనతో చర్చించారు. పాఠశాల విద్యా కమిషనర్ సంధ్యారాణి, సాంకేతిక విద్యా కమిషనర్ పాండాదాస్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


## ఈపీఎఫ్ ఖాతాలకూ ఆధార్

**న్యూఢిల్లీ :** కొత్త సంవత్సరంలో ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకుగాను ఖాతాలను ఆధార్ సంఖ్యతో అనుసంధానించాలని ఈపీఎఫ్ఓ నిర్ణయించింది. ఇలా అనుసంధానించిన ఖాతాదారులందరికీ సార్వత్రిక ఖాతా సంఖ్య (యూఏఎన్)ను కేటాయించాలని నిర్ణయించింది. 2017లో డిజిటల్ లావాదేవీలవైపు అడుగులు వేసిన ఈపీఎఫ్ఓ తన కార్యాలయం నుంచి అందించే సేవలన్నిటినీ స్మార్ట్‌ఫోన్ ద్వారానే ఖాతాదారులు పొందగలిగే సదుపాయాన్ని కల్పించింది. ఈ క్రమంలో 2018 ఆగష్టు 15 నాటికి కాగితం లేని లావాదేవీలు నిర్వహించాలని ఈపీఎఫ్ఓ లక్ష్యంగా పెట్టుకుంది.

## మధ్యాహ్న భోజన పథకానికి రూ.103.12 కోట్ల నిధులు

**రాజధాని ప్రతినిధి,అమరావతి :** రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికిగాను 2017-18 బడ్జెట్టు కింద రూ.103 . 12 కోట్ల 44 వేల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్ ఉత్తర్వులు విడుదల చేశారు1 నుంచి 8తరగతి చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం కింద ఈ నిధులను ప్రభుత్వం కేటాయిస్తుంది.

## మా పార్టీ మేలిమి బంగారం



**చెన్నై :** డీఎంకే నేత ఎంకే స్టాలిన్ మాట్లాడుతూ 2 జీ స్కామ్‌లో కనిమోళి,ఎ.రాజాలను నిర్ధోషులుగా కోర్టు తీర్పు వెలువరించడంతో పార్టీపై పడిన అవినీతి కళంకం తొలిగి పుటం వేసిన బంగారంలా మారిందన్నారు. ఈ కేసు డీఎంకే లక్ష్యంగా చేసుకొని అల్లిన కట్టుకథగా ఆయన అభివర్ణించారు. ఏడేళ్ల తర్వాత నిరోషిత్వం నిరూపితమైందని, డీఎంకేకు చెందిన టెలికం మంత్రి ఎ. రాజా ప్రగతిపథ నిర్ణయాలు తీసుకున్నారని ఆయన ప్రశంసించారు. కాగ్ వినోద్‌రూమ్ ఇందులో రూ.1.76 లక్షల కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించిన విషయం తెలిసిందే. రాజా, కనిమొళిలు కళంకితులుకామని నిరూపించుకున్నారని స్టాలిన్ ఆనందం వ్యక్తం చేశారు.

## ఆలయాల్లో నూతన సంవత్సర వేడుకలొద్దు

**గుళ్లలో పాశ్చాత్య పోకడలు సరికాదు దేవాదాయశాఖ ఆదేశాలు జారీ**

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** సనాతన ధర్మ పరిరక్షణలో భాగంగా ఆలయాల్లోకి పాశ్చాత్య సంస్కృతి విస్తరించకుండా దేవాదాయశాఖ చర్యలు చేపడుతోంది. రాష్ట్రంలోని పలు ఆలయాల్లో జనవరి 1న ప్రత్యేకంగా తోరణాలు కట్టడంతో పాటు ముగ్గులు వేసి పండుగ వాతావరణం సృష్టిస్తున్నారు. ఇకపై అలాంటి వేడుకలు, కార్యక్రమాలు ఆలయాల్లో జరగడానికి వీల్లేదని స్పష్టంచేస్తూ ఆ శాఖ ఆదేశాలు జారీ చేసింది. చైత్రమాసంలో వచ్చే ఉగాదినే కొత్త సంవత్సరాదిగా భావించాలని, ఆ రోజే వేడుకలు, కార్యక్రమాలు చేపట్టాలని స్పష్టం చేసింది. పాశ్చాత్య సంప్రదాయాలకు పట్టంకడుతూ గుడికి వచ్చిన భక్తులకు శుభాకాంక్షలు తెలపడం, వారు సమర్పించిన కానుకలను పుష్పాలంకరణలకు ఖర్చు చేయడం సరికాదని తన ఆదేశాల్లో పేర్కొంటూ అన్ని ఆలయాల ఈవోలు, జిల్లాల సహాయ కమిషనర్లకు ఈ ఆదేశాలను పంపింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 వసంతాలు గడిచినా ఆంగ్లేయులు అలవాటు చేసిన క్రీస్తు శకాన్ని మనం ఇప్పటికీ అనుసరిస్తూనే ఉన్నామని హిందూ ధర్మపరిరక్షణ ట్రస్టు కార్యదర్శి డాక్టర్ చిలకపాటి విజయరాఘవాచార్యులు ఆవేదన వ్యక్తం చేశారు.


## మన కోసం

| | | | |
|---|---|---|---|
| శ్రీ విజయలక్ష్మి జనరల్ స్టోర్స్ | తుళ్ళూరు | చందోలు సత్యనారాయణ | 9441411432 |

**రెస్టారెంట్స్**

| | | | |
|---|---|---|---|
| బిర్యానిస్ | విజయవాడ | బిర్యానిస్ | 7032202222 |
| స్వాగత్ మెస్(వెజ్) | మల్కాపురం | చిగురుపాటి | 90329 58580 |
| ఎస్.ఆర్.కె. గ్రాండ్ | మందడం | శ్రీనివాస్ | 9553023388 |

**షాప్స్**

| | | | |
|---|---|---|---|
| రేమాండ్స్‌టైలర్స్ | తుళ్ళూరు | ఎస్.కె. జాని | 9492470426 |
| వర్షిత ఫోటోస్టాట్ | రాయపూడి | పోతురాజు | 9985853188 |
| బిస్మిల్లా పెయింటింగ్ వర్క్స్ | రాయపూడి | షేక్. మజీదు | 7095880828 |
| కె.జి .ఎన్. కారు ట్రావెల్స్ | రాయపూడి | ఎస్.కె.సుభాని | 97040 74820, |
| వైభవ్ డ్రస్సెస్ | తుళ్ళూరు | ఎస్‌వి. పున్నారావు | 9848407935 |
| చైతన్య గోదావరి బ్యాంకు | రాయపూడి | | 08645244266 |
| ఉంగరాల హుస్సేన్ టెంట్‌హౌస్ | రాయపూడి | ఉంగరాలఖాజ | 9441275466 |
| అంజుమన్ టెంట్ హౌస్ | రాయపూడి | పఠాన్ బాషా ఖాన్ | 9502085516 |
| రాజా గోల్డ్ కవరింగ్ | తుళ్ళూరు | చుండూరు పద్మావతి | 9581500500 |


**ట్రేడర్స్**

| | | | |
|---|---|---|---|
| సాయి గణేష్ | వెలగపూడి | జొన్నలగడ్డ మనోజ్ కుమార్ | 7382371111 |
| శ్రీ చంద్రిక | రాయపూడి | కోలా శ్రీనివాసరావు | 908073516 |

**మ్యారేజీ లింగ్స్**

| | | |
|---|---|---|
| షేక్ జానీ | విజయవాడ | 9985394613 |


## క్రీడాభిమానుల ఆలోచనా ధృక్పదం మారాలి




**భా**రతీయులంతా అదోటైపు.. ఎందుకు ఒకరిని అభిమానిస్తారో.. ఎంతో కీర్తి ప్రతిష్టలకు అర్హులైన వారిని ఎందుకు పక్కన పెడతారో తెలీదు.. దేశంలో ఎన్నో క్రీడలుండగా ఒక్క క్రికెట్ అంటేనే ఎందుకు పడి ఛస్తారో అంతుబట్టదు. నిజానికి అమెరికన్స్ అందరూ ఇది 11 ఫూల్స్ ఆడుతుండగా మరో 11 వేల మంది ఫూల్స్ దీన్ని చూస్తారని ఈసడించుకుంటారు. అలాంటి గేమ్‌కు ఇక్కడ జనం బ్రహ్మరథం పడతారు. దీనినీడలో మిగతా ఆటలన్నీ ద్వితీయ శ్రేణి ఆటలుగా మారిపోయాయి. జనాల్లో ఉన్న ఈ క్రేజ్‌ను కాష్ చేసుకుంటానికి క్రికెట్ ఆటగాళ్లనే కార్పొరేట్ సంస్థలు తమ బ్రాండ్ అంబాసిడర్లుగా ఎంపిక చేసుకోవడంతోపాటు అత్యధిక పారితోషికం( ఇప్పుడు వారివేతనాలు మరింతగా పెంచారు) ఇచ్చి ప్రోత్సహిస్తారు. ప్రతిరోజు ఆ క్రీడాకారులు నిలువెత్తు ఫోటోలు అన్ని పేపర్లలోనూ ప్రచురిస్తారు. ఇదంతా ఎందుకు చెప్పవలసి వస్తుందంటే ఈ నెల్లోనే భారత ఫుట్‌బాల్ టీమ్ కెప్టెన్ సునీల్ చెత్రి వివాహం చేసుకున్నారు. అయితే పత్రికలు ఆయన పెళ్లికి అంత ప్రాధాన్యం ఇవ్వలేదు. దేశం విడిచివెళ్లి రహస్యంగా పెళ్లి చేసుకున్న క్రికెట్ టీమ్ కెప్టెన్ కోహ్లి, బాలివుడ్ నటి అనుష్కశర్మలకు మాత్రం అత్యంత కవరేజ్ ఇచ్చి పోటీలు పడి మరీ ఫోటోలు విడుదల చేస్తున్నారు.

ఇండియన్ ఫుట్‌బాల్ టీమ్ కెప్టెన్‌సునీల్ చెత్రి వివాహం లెజండరీ ఫుట్‌బాల్‌ఆటగాడు సుబ్రతా బట్టాచార్య కుమార్తె, తన చిరకాల స్నేహితురాలు సోనమ్ బట్టాచార్యతో ఈనెల 4న నేపాల్, పశ్చిమబెంగాల్ పద్దతుల్లో వైభవంగా జరిగింది. సునీల్ తండ్రి ఆర్మీలో ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఆయన అనేక సార్లు మిలటరీ ఫుట్‌బాల్ టీం తరుపున పాల్గొని పతకాలను అందించారు. అతని తల్లి, సోదరీమణులు కూడా క్రీడాకారులే. దేశ, అంతర్జాతీయ ఆటల్లో విశేష ప్రతిభను ప్రదర్శించిన సుబ్రతా బట్టాచార్య ప్రతిభకు పట్టంగట్టిన ప్రభుత్వం అతనిని మోహున్ బగన్ రత్నతో సత్కరించింది. దురంద్,రోవర్స్, ఐఎఫ్ఏ షీల్డ్‌ల్లో ఆడటమేకాకుండా,న్యూయార్క్ కాస్మోస్ టీమ్‌లో ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్రీడాకారుడు పీలే సారధ్యం వహించిన జట్టుతో తలపడి 2-2తో పాయింట్లతో డ్రా చేశాడు.

సునీల్ చెత్రి విషయానికి వస్తే 56 గోల్స్‌తో రికార్డు సృష్టించి దేశంలో అందరికన్నా టాప్‌లో నిలుస్తున్నారు. 2007,2009,2012 నెహ్రూ కప్ సాధించాడు.2011లో ఎస్ఏఎఫ్ఎఫ్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నాడు. త్వరలో అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో కాలుమోపడానికి ఎదురుచూస్తున్నాడు. ఏది ఏమైనా ఆటగాళ్లకు సమాన గౌరవమర్యాదలు దక్కాలంటే క్రీడాభిమానులు, ఆయా ఫెడరేషన్ల ఆలోచనా ధృక్పదం మారాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ఏయ్... వస్తావా..??



ఆమె


ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఏదో ఒకరోజు అర్ధరాత్రి ఒంటరిగా బయటకు వెళ్లాల్సిన అవసరం ప్రతి ఒక్కరికీ రావచ్చు. పురుషులైతే సరే... మరి అదే మహిళల సంగతేంటి ? బస్సు ఆలస్యంగా వస్తేనో.. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్లవలస వస్తేనో పరిస్థితి ఏంటి ? అలాంటి పరిస్థితిలోకి కావాలనే మెరిన జోసఫ్ అడుగుపెట్టింది.

బస్టాండు, బీచ్ ఎక్కడ చూసిన ఒక్కరంటే ఒక్క మహిళకూడా లేదు. రోడ్డుకు ఇరుప్రక్కల పురుషులు, యువకులు, వారి చూపులు భయంకరంగా ఉన్నాయి. పక్కనుంచి రయ్‌రయ్‌మని పోయే బైకులు, సడన్‌గా పక్కన ఆపి ...వస్తావా అంటూ అడుగుతున్నాయి. అంటే రాత్రి మగవారిదే అని తెలిసిపోయింది. ఇక్కడ ఆడవారికి భద్రత, భరోసా ఏదీలేదని రుజువయ్యింది. అలా ఒంటరిగా వెళుతుండగా, పోలీసులు ఇద్దరు వచ్చి ఏం పని మీద వెళుతున్నావంటూ ప్రశ్నించారు ఆ నగర ఐపీఎస్ అధికారి మెరిన జోసఫ్‌ను ...

చాలా మంది చీకటిపడితే ఆడవారికి భద్రత లేదని, కావాలంటే ఒకసారి పరిశీలించాలని చాలా సార్లు అడగడంతో ఆమె ఈ సాహసానికి ఒడికట్టింది. ఆరోజు తానే అభద్రతకు గురయ్యానని ఒప్పుకున్నారు. అతి చిన్నవయస్సులోనే ఐపీఎస్‌కు ఎంపికయిన డీసీపీ మెరిన జోసెఫ్. కేరళ నుంచి అంతకుముందు కేవలం ఇద్దరు మహిళలు శ్రీలేఖ,సంధ్యలు మాత్రమే ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. కేరళలోని కొట్టాయంలో మెరిన పుట్టినా చదువంతా ఢిల్లీలోనే కొనసాగింది. సెయింట్ స్టీఫెన్ కాలేజీలో ఆమె బీఏ ఆనర్స్ చదివారు..ఆపై 2012లో సివిల్స్‌లో 188 ర్యాంకు సాధించారు. దీంతో హైదరాబాద్ నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పొంది ఎర్నాకుళం రూరల్ ట్రైనీ ఏఎస్పీగా పదవీబాధ్యతలు చేపట్టారు. తన స్నేహితుడు, కాలేజ్ మేట్, సైకియాట్రిస్ట్ అయిన క్రిస్ అబ్రహామును 2015లో ఆమె పెళ్లిచేసుకున్నారు. అందమైన ఐఏఎస్, ఐపీఎస్‌లు అంటూ హైదరాబాద్‌లో ఉద్యోగబాధ్యతలు నిర్వహిస్తున్న ఐఏఎస్ అధికారి సబితా అగర్వాల్, మెరిన జోసఫ్ పేర్లను దివైర్ వెబ్ పత్రిక ప్రచురించడం ఎంతో వేదనకు గురిచేసిందంటారు. అందానికి మాత్రమే పరిమితమవుతూ బాధ్యతల నిర్వహణ, కర్తవ్యదీక్షను మీడియా గుర్తించలేకపోవడం వారి వెనుకబాటుదనానికి నిదర్శనమని ఆమె చెబుతారు. ఒకసారి ఒక మంత్రి మీటింగ్‌ను పర్యవేక్షిస్తుండగా పార్టీ ఎమ్మెల్యే తీసిన ఫొటో వైరల్ అయింది. మంత్రికి ఆమెకు మధ్య దూరం ఎక్కువగా ఉన్నప్పటికీ దగ్గరచేసి చూపించి మీడియా నానా హంగామా సృష్టించింది. అయితే దాన్ని ఆమె నిబ్బరంగా ఎదుర్కొని నిజమైన ఫొటోలను విడుదల చేశారు. చిన్న చితకా ఉద్యోగస్తులకే కాదు.. ఉన్నత పదవులు నిర్వహిస్తున్నవారికి మహిళలకు కూడా వేధింపులు తప్పడం లేదని ఈ పరిస్థితులు తెలియచెబుతున్నాయి. అయినా ఆత్మవిశ్వాసంతో ప్రజలకు రక్షణ,భద్రత కల్పించాలన్న ధృఢ నిశ్చియంతో ముందుకు సాగుతున్నారు మెరిన జోసెఫ్.

– ఖాన్

# ఎన్నికల్లో నోటా ఘన విజయం



గుజరాత్,హిమాచల్ ప్రదేశ్‌ల్లో జరిగిన ఎన్నికల్లో నైతికంగా మాదే విజయం అని కాంగ్రెస్ చెబుతుండగా, వరుసగా ఆరోసారి మేము విజయం సాధించామని అధికార బీజేపీ సంబరాలు నిర్వహించింది. నిజానికి వీరిద్దరిదీ విజయం కాదు విజయం ఈ వీఎంలోని నోటా అంటే ఎవరికీ ఓటు లేదు అనే బటన్‌ది. ఎందుకంటే ఇప్పటివరకు 5.4 లక్షల భారీ ఓట్లు దానికి పడటం చాలా గొప్పవిషయం. రానున్నరోజుల్లో దీనికి మద్దతు పెరిగి ఓటర్లు దీనిని నొక్కితే తమ భవిష్యత్ ఏమిటన్నది రాజకీయపార్టీలు పునరాలోచించాలి. ప్రజల ఆకాంక్షలకు తగ్గట్లుగా పార్టీలు రూపుదాల్చకుండా ప్రజలను మభ్యపెడుతూ ఎల్లకాలమూ అధికారం చేపట్టాలంటే కుదరదని చేసిన హెచ్చరికే నోటా ఓట్లసంఖ్య.

మోడీ ఎన్నికల్లో గెలుపునే లక్ష్యం చేసుకొని అన్నివిధాలుగా తన స్థాయిని తగ్గించుకున్నారు. మణిశంకర్ అయ్యర్ ఇంట్లో ఏర్పాటు చేసిన పార్టీలో తనను అంతమొందించడానికి శత్రుదేశం పాక్‌తో కలసి కుట్రపన్నారనడం రాజకీయ దిగజారుడని చెప్పక తప్పదు. ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండగా కాని, ప్రధానిగా కాని ఎప్పుడూ వారికి ఇఫ్తార్ విందు ఇవ్వడం లేదా విందులో పాల్గొనడం చేయలేదు. రాష్ట్రపతి ఇఫ్తార్ విందులో కూడా పాల్గొన్నపాపాన పోలేదు. అంతేకాకుండా ముస్లిం అభ్యర్థులను ఎన్నడూ తన పార్టీలో స్థానం కల్పించని మోడీ వారి రిజర్వేషన్లపై మాట్లాడారు. నీచ్ అనే పదానికి అర్థాలు చెబుతూ ఆయన సామాన్యుడు అవడంవల్ల, బీసీ (గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండగా ఆయన తనకులాన్ని బీసీల్లో చేర్చారు) అయినందువల్లే మణిశంకర్ ఆవిధంగా సంబోధించాడని, ఇది యావత్ గుజరాతీయులకు అవమానమని వారిని రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. అయితే దీన్ని బీజేపీ మిత్రపక్షం శివసేన కూడా తప్పుపడుతూ ప్రధాని ఇంకా రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయిలోనే ఆలోచిస్తున్నారని ఎద్దేవా చేసింది. పార్లమెంటు సమావేశాలను కూడా వాయిదా వేసి బీజేపీ ఉధృతంగా ప్రచారం చేసింది. దానిలో ప్రధాని, జాతీయ కార్యదర్శి అమిత్‌షాలతోపాటు 50 మంది కేంద్ర మంత్రులు,122 మంది ఎంపీలు ప్రచారంచేసి రాష్ట్ర ఎన్నికల్లో విజయం కోసం అమితకృషి చేశారు.ఎంపీలు,ఎమ్మెల్యేలు వీధివీధి తిరిగారు. చావుతప్పికన్నులొట్టబోయినట్లు 182స్థానాలున్న గుజరాత్‌లో వంద స్థానాలను కూడా చేరుకోకుండా ఎలాగొలా గెలిచామనిపించుకున్నారు.

కాంగ్రెస్ అపార అనుభవ సంపన్నులు ఉన్న పార్టీ అయినా వారిని ఉపయోగించుకోవడంలో ఆపార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఘోర పరాజయం పొందారు. ఇదివరకటి కంటే ఆయన తన వాగ్దాటిని పెంచుకుని ఉండవచ్చుగాని, ఎన్నికల్లో మోడీ లాంటి మాటల మరాఠీని ఎదుర్కోవడం ఎంతకష్టమో తెలియందికాదు. ఏరాష్ట్రంలోనూ ప్రచారం చేసి గెలిచిన దాఖలాలు లేని రాహుల్ అతివిశ్వాసంతో ఆయన ఒక్కడే ప్రచారంలో పాల్గొన్నాడు కాని, సీనియర్లను రంగంలోకి దించలేదు. దిశా నిర్దేశం చేయగలిగిన వాళ్లు అనేకమంది ఉన్నప్పటికీ గుజరాత్ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోకుండా గెలుస్తామని ధీమా ప్రదర్శించడం నాయకుడి లక్షణం కాదు. ఇంతకు ముందు కాంగ్రెస్‌కున్న 61సీట్లనుంచి ప్రస్తుతం సాధించిన 80 స్థానాలు కూడా ఆయన వల్లే వచ్చాయనుకోవడం సరికాదు. ఆరాష్ట్రంలోని ముగ్గురు యువకులు కాలికి బలపం కట్టుకుని వారి శక్తియుక్తులు ధారపోయడం వల్ల గెలిచిన సీట్లని చెప్పక తప్పదు. పటీదార్ల ఆందోళ సమితి ఉద్యమనేత హార్దిక్‌పటేల్ ఓబీసీ వర్గంనుంచి అల్పేష్ ఠాగూర్, ఎస్సీ వర్గం నుంచి జిగ్నేష్ మేవానీలు తమ శక్తినంతటినీ ధారపోశారు. ఇక హిమాచల్ ప్రదేశ్‌లో అయితే ఎప్పుడో రెండు సార్లు రాహుల్ ఆరాష్ట్రంలో ప్రచారం చేశారుకాని జాతీయనాయకులు కూడా ఎవరూ ఆరాష్ట్రంలో కాలుపెట్టలేదని అయితే ప్రత్యర్థిపార్టీ బీజేపీ మాత్రం ప్రచారం ముమ్మరంగా చేసిందని అక్కడి కాంగ్రెస్ ముఖ్యమంత్రి వీరభద్రసింగ్ ఆవేదన వెళ్లగ్రక్కారు.

రాజీవ్ గాంధీ హయాంలో నమ్మకస్తులను సీనియర్ల సలహాలను అమలు చేయడానికి ఎటువంటి భేషిజం చూపేవారుకాదు. ఇంతకుముందు సార్వత్రిక ఎన్నికల్లో గులాబ్‌నబీ ఆజాద్, దిగ్విజయ్‌సింగ్, కపిల్‌సిబాల్, వీరప్పమొయిలీ వంటివారి సేవలను, ప్రచారాన్ని కాంగ్రెస్ వినియోగించుకుంది. అయితేరానురాను ఒంటెత్తు పోకడలను ప్రదర్శిస్తూ రాహుల్‌పైనే బాధ్యత పెట్టడం సమంజసం కాదు.

దేశం, రాష్ట్రంలో అధికారపార్టీలతో ప్రజలు విసిగిపోతున్నారన్నది మాత్రం నిజం. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని ప్రజల అంచనాలకు తగ్గట్టుగా తమపార్టీని రూపొందించుకోవడంలో కమ్యూనిస్టులు ఘోరపరాజయం పొందారన్నది కఠిన వాస్తవం. వామపక్షపార్టీలు ఎక్కడో ఒకటి రెండు సీట్లతోనూ వీదుల్లో ధర్నాలకే పరిమితమై సిద్ధాంతాల పేరుతో వెనుకబడిపోవడం దురదృష్టకరం.

## కాలమ్

### నాన్నకి అంకితం

అమ్మ... ప్రపంచానికి నిన్ను పరిచయం చేస్తుంది.
నాన్న.. ప్రపంచాన్ని నీకు పరిచయం చేస్తాడు.
జీవితం అమ్మది- జీవనం నాన్నది.
ఆకలి తెలీయకుండా అమ్మ చూస్తుంది.
ఆకలి విలువ తెలిసేలా నాన్న చేస్తాడు.
అమ్మ భద్రత-నాన్న బాధ్యత.
పడిపోకుండా పట్టుకోవాలని అమ్మ చూస్తుంది.
పడినా పైకి లేవాలని నాన్న చెప్తాడు
నడక అమ్మది -నడవడిక నాన్నది.
తన అనుభవాలను విద్యలా బోధిస్తుంది. అమ్మ.
నీ అనుభవమే విద్య అని తెలిసెలా చేస్తాడు నాన్న.
అమ్మ అలోచన- నాన్న ఆచరణ
అమ్మ ప్రేమను నీ పసిప్రాయం నుండే
తెలుసుకోగలవు. కానీ...
నాన్న ప్రేమను నువ్వు నాన్నవు అయ్యాకే తెలుసుకోగలవు...
కొడుకు : ఈ రోజు నా గుండె ఆపరేషన్ నాన్న
నాన్న : తెలుసురా ఎందుకు బయటపడుతున్నావ్
నేను ఉన్నానుకదా నీకు
కొడుకు ఐ అవ్ యూ నాన్న
నాన్నఐ లవ్ యూ టూ రా చెపుతూ ఏడ్చాడు
ఆపరేషన్ తరువాత ఎప్పుడైతే ఆ అబ్బాయ్‌కి మెలుకువ వచ్చిందో కళ్ళ ముందు ఒక్క ఫ్రెండ్ ఉన్నాడు
కొడుకు : మా నాన్న ఎక్కడా
ఫ్రెండ్ : నీకు తెలియదా నీకు గుండె ఏవరిచ్చారో మీ నాన్నేనురా!
కొడుకు : గుండె పగిలేల ఏడవడం మొదలుపెట్టాడు
అప్పుడు గుండె నుంచి ఒక్క శబ్దం వచ్చింది. ఏడవకురా నీ గుండె చప్పుడులో నేను ఎప్పుడు నీతో బ్రతికే ఉంటానురా
కొడుకు ఐ మిస్ యూ నాన్న
మన కాళ్ల మీద మనం నిలబడ్డామని అమ్మ నాన్నని దూరం పెట్టకు. మనం ఇలా నిలబడానికి అమ్మ నాన్న మన ముందుండి నడిపించారు. మర్చిపోకు మన భారాన్ని అంత నాన్న మోస్తూ మనల్ని నడిపించాడు మనం సంతోషంగా బ్రతకడానికి తన ప్రాణాలను దరబోసే వాడు నాన్న ఐ లవ్ యూ నాన్న

### మంచి కథ

ఒక సారి ఉత్తమ బ్రాహ్మణుడైన చాణిక్యుని దగ్గరకు అతని మిత్రుడు ఒకడు వచ్చి నీకు తెలుసా నీ మిత్రుడు గురించి నేను ఒక విషయం విన్నాను" అని ఎంతో ఉత్సాహంగా ఇంకేదో చెప్పబోతున్న అతన్ని చాణిక్యుడు ఆపి "నీవు నా మిత్రుడు గురించి చెప్పబోయే ముందు ఒక్క నిముషం సావధానంగా నీవు చెప్పబోయే విషయాన్ని కొద్దిగా జల్లెడ పడదాం దీన్ని నేను "మూడు జల్లెడ్ల పరీక్ష అంటాను అని అడగటం మొదలు పెట్టాడు.
మొదటి జల్లెడ " నిజం"-"నీవు స్నేహితుడి గురించి చెప్పబోయే విషయం ఖచ్చితంగా నిజమైనదని నీకు తెలుసా? అని అడిగాడు.
అందుకు ఆ స్నేహితుడు" లేదు, ఎవరో అంటుండగా విన్నాను" అని అన్నాడు. "అంటే నీవు చెప్పబోయే విషయం నిజమైనదే అని నీకు తెలీదన్న మాట" అని చాణిక్యుడు అన్నాడు.
సరేం రెండో జల్లెడ "మంచి" నీవు నాకు చెప్పబోయే విషయం నా మిత్రుని గురించిన మంచి విషయమా? అని అడిగాడు చాణిక్యుడు,
"కాదు" అన్నాడు చాణిక్యుని స్నేహితుడ్ను.
"అంటే నీవు నా మిత్రుని గురించి చెడు చెప్పాలను కున్నావు, అది కూడా నీకు ఖచ్చితంగా నిజమని తెలీని విషయం-సరే ఇంక మూడో జల్లెడకు వెళదాం" అన్నాడు చాణిక్యుడు.
మూడో జల్లెడ" ఉపయోగం" నీవు నా మిత్రుని గురించి చెప్పబోయే విషయం నాకు ఉపయోగమైనదా? " అని చాణిక్యుడు అడిగాడు.
"లేదు" అన్నాడు ఆ మిత్రుడు.
"అయితే నీవు చెప్పబోయే విషయం
నిజమైనది, మంచిది, ఉపయోగకరమైనది
కానపుడు నాకు చెప్పటం ఎందుకు? " అని అన్నాడు చాణిక్యుడు
**నీతి :** మన గురించి, మన వాళ్ళ గురించి చెడు వార్తలను, విషయాలను మోసే వాళ్ళు చాలా మంది వుంటారు. ఒక విషయం (చాడి) వినేముందు ఈ మూడు జల్లెడల పద్ధతి అనుసరిస్తే, మన బంధాలు నిలబడతాయి.
మంచి పెంపొందుతుంది. చాడీలు నివారించబడతాయి.

## చంద్రబాబును పిలవకపోవడం అవివేకం

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** ప్రపంచ తెలుగు మహాసభలకు తోటి తెలుగు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును ఆహ్వానించకపోవడం తెలంగాణ సీఎం కేసీఆర్ అవివేకానికి నిదర్శనమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు మహాసభలు టీఆర్ఎస్ రాజకీయ సభలను తలపిస్తున్నాయని ఓ ప్రకటనలో విమర్శించారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన తెలుగు కవులు, రచయితలను విస్మరించడం దురదృష్టకరమన్నారు. రావూరి భరద్వాజ ఫోటోను తెలుగు మహాసభల్లో ఎక్కడా కనిపించకుండా చేయడం, ప్రజా గాయకుడు గద్దర్, ప్రజాకవి అందెశ్రీ వంటి వారిని సభలకు ఆహ్వానించకపోవడం ద్వారా ద్వంద్వ వైఖరిని చాటుకున్నారన్నారు.

## రైల్వే ఉద్యోగాల ప్రక్రియ శీఘ్రతరం

**రెండేళ్ల నుంచి ఆర్నెల్లకు కుదింపు**


**న్యూఢిల్లీ :** రైల్వేలో ఉద్యోగం పొందాలంటే కనీసం రెండు సంవత్సరాలు వేచి చూడాల్సి వస్తోంది. నోటిఫికేషన్ విడుదల చేసిన దగ్గర నుంచి ఉద్యోగం చేతికి వచ్చేంత వరకు నెలల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఇకపై అటువంటి సమస్య ఉండకుండా ఉండేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ చర్యలు చేపట్టింది. రైల్వే నియామక ప్రక్రియను రెండేళ్ల పాటు కొనసాగించకుండా... ఇక నుంచి ఆరునెలల్లో ఈ ప్రక్రియను ముగించేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ విషయమై రైల్వే బోర్డు ఛైర్మన్ అశ్వని లోహాని ఆధ్వర్యంలో జనరల్ మేనేజర్ల సమావేశం జరిగింది. రైల్వేలో భర్తీ చేయాల్సిన ఖాళీల సంఖ్య ఎక్కువగా ఉందనే విషయాన్ని జోనల్ హెడ్స్ లోహాని దృష్టికి తీసుకెళ్లారు. 'రైల్వే ఉద్యోగాల నియామక ప్రక్రియ సుదీర్ఘంగా ఉంటుంది. దరఖాస్తు తీసుకున్న దగ్గర నుంచి ఉద్యోగం రావడానికి కనీసం రెండేళ్ల సమయం పడుతుంది. దీంతో కొంతమంది అభ్యర్థులు వేరే ఉద్యోగాలకు వెళ్లిపోతున్నారు. ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించడం, నియామక ప్రక్రియను వేగంగా పూర్తిచేస్తే బాగుంటుంది' అని నార్త్‌ఈస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ ఈ సమావేశంలో ప్రతిపాదనను తీసుకొచ్చారు. దీనపై స్పందించిన లోహానీ రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ ఆర్ బీ) తమ నియామక ప్రక్రియను ఆరు నెలల్లోపు పూర్తి చేయాల్సిందిగా సూచించారు. దీనిపై వాళ్ల అభిప్రాయాన్ని డిసెంబరు 20లోపు తెలియజేయాల్సిందిగా కోరారు. డిసెంబరు 2016 నాటికి రైల్వేలో 1.3 మిలియన్ల మంది ఉద్యోగులు మాత్రమే ఉన్నారు. ఇంకా గ్రూప్ 'సి', 'డి' విభాగంలో2,25,823 ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉంది. రైల్వే నివేదిక ప్రకారం భద్రతా విభాగంలో 1,22,911 ఖాళీలు ఉండగా.మిగతా విభాగాల్లో 17,464 ఖాళీలు ఉన్నాయి. వీటిలో ఎక్కువగా డ్రైవర్లు, గార్డులు, గ్యాంగ్ మెన్, ఇతర టెక్నికల్ స్టాఫ్ ఖాళీలే ఉన్నట్లు సమాచారం.

## ఏక కాలంలో లోక్‌సభ, అసెంబ్లీల ఎన్నికలకు సన్నాహాలు

**బడ్జెట్ సమావేశాల్లో చట్టం చేయనున్న కేంద్రం**

**న్యూఢిల్లీ :** 2018-19 లో అసెంబ్లీలకు, లోక్ సభకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. బడ్జెట్ సమావేశాల్లో ప్రధాని నరేంద్రమోడీ ఈ మేరకు చట్టం తీసుకురానున్నట్టు బీజేపీ వర్గాలు వెల్లడించాయి. హిమాచల్‌ప్రదేశ్‌లో గెలుపు అనంతరం 19 అసెంబ్లీలలో బీజేపీ-ఎన్‌డీఏ అధికారంలో ఉంది కాబట్టి ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలన్న కేంద్ర ప్రభుత్వ యోచన ఫలించే అవకాశముంది. 2018, అక్టోబరులో 13 అసెంబ్లీలతో పాటు లోక్‌సభకు ఎన్నికలు నిర్వహించాలని ప్రధాని భావిస్తున్నట్టు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఫిబ్రవరిలో పార్లమెంటులో రాజ్యాంగ సవరణ బిల్లుకు ఆమోదం లభిస్తే... సభకు 50 శాతం మంది సభికులు హాజరైన రోజున ఈ బిల్లుకు ఆమోదం లభించేలా చేయడం మోడీ ప్రభుత్వానికి పెద్ద కష్టమేమీ కాదు. ఇందిరా గాంధీ సర్కార్ ఎమర్జెన్సీ సమయంలో చేసినట్లుగా అసెంబ్లీల పదవీకాలాన్ని పొడిగించే అవకాశమూ లేకపోలేదు. ఈసారి ఎలాగైనా రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని మోడీ ప్రభుత్వం గట్టి పట్టుదలతో ఉంది. అయితే ఏకకాలంలో ఎన్నికలను నిర్వహించాలన్న ప్రతిపాదన కొత్తదేమీ కాదని ఎప్పటినుంచే ఉందని మోడీ పేర్కొన్నారు. ఇటీవల ఎన్నికల కమిషనర్ ఓం ప్రకాష్ రావత్ భోపాల్‌లో మాట్లాడుతూ ప్రధాన మంత్రి కార్యాలయం ఇప్పటికే విధివిధానాలను రూపొందించిందని అన్నారు. రెండుదశల్లో లోక్‌సభ, అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ముసాయిదా తీర్మానాన్ని నీతిఆయోగ్ సిద్ధంచేసినట్టు తెలుస్తోంది. ఇందుకోసం కొన్ని అసెంబ్లీల కాలాన్ని పొడిగించడం లేదా ఒకేసారి పరిష్కారం చూపాల్సి ఉంటుందని ఓ నివేదన పేర్కొంది. 2018 మార్చి మే నెలల్లో పదవీకాలాన్ని పూర్తిచేసుకోనున్న కర్ణాటక, త్రిపుర, మేఘాలయ అసెంబ్లీల ఎన్నికలను పొడింగించే అవకాశముంది. అది జరుగుతుందా లేదా అన్నది ప్రధాన మంత్రి అంతిమ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. కాగా, ఈ ప్రతిపాదన ఆధారంగా ప్రస్తుతమున్న ప్రజా ప్రాతినిధ్యం చట్టం, రాజ్యాంగ నిబంధనల వంటివి రద్దు చేయడంగానీ కొత్త వాటిని ప్రవేశపెట్టడమో జరగాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ఎన్నికల కమిషన్ ఐదేళ్లు పూరిచేసుకున్న అసెంబ్లీలకు, లోక్‌సభకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఇదిలావుండగా, సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలన్న ప్రధానమంత్రి ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ పద్ధతి రాష్ట్రాల హక్కులను హరిస్తుందని తెలిపారు. ఏకకాలంలో ఎన్నికలు బదులు పార్లమెంటులో దామాషా ప్రాతినిధ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని సీపీఐ ప్రతిపాదించింది. నిర్ధేశిత నియోజన వర్గాల్లో గెలుపుతో సంబంధం లేకుండా ఎంతైతే ఓట్ల శాతాన్ని పార్టీలు దక్కించుకుంటాయో శాసన సభల్లో అంతే శాతం సీట్లను పొందే అవకాశం ఉంటుంది. ఏకకాలంలో ఎన్నికలు నిర్వహణపై మోడీ వైఖరి మార్చుకోకపోతే దీన్ని వ్యతిరేకిస్తున్న ఇతర రాజకీయ పార్టీలతో కలిసి ప్రజా ఉద్యమాన్ని చేపడతామని సురవరం తెలిపారు.

## రూ.2000నోట్ల ముద్రణ నిలిపివేత!



బిజినెస్

**న్యూఢిల్లీ :** రూ.2000 నోట్ల ముద్రణను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిలిపివేసి ఉండడం లేదా తక్కువ మొత్తంలో ముద్రిస్తూ ఉండోచ్చని ఎస్‌బీఐ తన పరిశోధన పత్రంలో అంచనా వేసింది. అందులో పలు ఆసక్తికర అంశాలను అది వెల్లడించింది. ఆ వివరాలు..

- ఆర్‌బీఐ ఇటీవల సమర్పించిన నివేదికను పరిశీలిస్తే.. మార్చి 2017 వరకు చలామణీలో ఉన్న చిన్న మొత్తం కరెన్సీ విలువ రూ.3,50,100 కోట్ల వరకు ఉంది.
- అంటే డిసెంబరు 8 నాటికి మొత్తం చలామణీలో ఉన్న నగదులో నుంచి వీటి విలువ తీసివేస్తే.. అధిక విలువ గల నోట్ల మొత్తం విలువ రూ.13,32,400 కోట్లుగా ఉన్నట్లు తేలింది.
- ఆర్థిక శాఖ ఇటీవల లోక్‌సభకు సమర్పించిన గణాంకాల ప్రకారం.. డిసెంబరు 8 నాటికి 1695.7 కోట్ల రూ.500 నోట్లు ; 365.4 కోట్ల రూ.2000 నోట్లను ఆర్‌బీఐ ముద్రించింది. వీటి మొత్తం విలువ రూ.15,78,700 కోట్లు.
- ఈ లెక్క ప్రకారం.. ఆర్‌బీఐ వద్ద (సరఫరా కాకుండా) ఉన్న పెద్ద నోట్ల విలువ (15,78,700-13,32,400 కోట్లు) రూ.2,46,300 కోట్లు అన్న మాట. ఆర్‌బీఐ రూ.50, రూ.200 నోట్లనూ ముద్రించిన నేపథ్యంలో పై విలువ తక్కువైనదిగానే భావించాలి.
- రూ.2000 నోటు లావాదేవీల పరంగా సవాళ్లను విసురుతున్న నేపథ్యంలో ఆర్‌బీఐ రూ.2000 నోట్ల ముద్రణను నిలిపివేయడం లేదా ద్రవ్యలభ్యత పరిస్థితులు చక్కబడ్డ నేపథ్యంలో చిన్న మొత్తంలో ముద్రించడమో జరుగుతూ ఉండాలి. అంటే మొత్తం చెలామణీలో ఉన్న నగదులో చిన్న నోట్ల వాటా 35 శాతంగా (విలువ పరంగా) ఉంది.

## గుంటూరులో వెస్ట్‌సైడ్ సందడి...!

**రాజధాని ప్రతినిధి, గుంటూరు :** దేశీయ రిటైల్ దిగ్గజం టాటా గ్రూప్‌లోని ట్రెంట్ అనుబంధ సంస్థ వెస్ట్‌సైడ్ స్టోర్‌ను ఏపీలోని గుంటూరు నగరంలో ప్రారంభించింది. వాణిజ్య కూడలిగా పేర్కొంది. లక్ష్మీపురంలో బేకర్స్ ఫన్ సమీపంలో ఈ స్టోర్‌ను ఖాతాదారులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇది భారత దేశంలో టాటా గ్రూప్ 119 స్టయిలిష్ స్టోర్. ఆధునిక ఫ్యాషన్లతో దుస్తులు, పాదరక్షలు, సౌందర్య సాధనాలెన్నో ఈ స్టోర్‌లో లభిస్తాయి.

ఖాతాదారుల మనసును ఆకట్టుకునే రీతిలో రూపొందించిన డిజైన్లు సరస ధరలకే లభిస్తాయి. వాడ్రోడ్ 9 టూ 9 కలెక్షన్స్, కాజువల్స్, యంగ్ అండ్ ఎడ్జీకి నూన్, కర్వీ ఉమెన్‌కు జీఐఏ, వ్యక్తిగత ఫ్యాషన్‌కు వంటర్ ప్లస్, వార్క్ ఫెస్టివ్ కలెక్టన్, యువతకు నచ్చే ఎథినిక్ వేర్‌ను అందించే బోంబే పైస్లీ, సుతి మెత్తని పట్టు, జుబా.. ఇలా అందరికీ నచ్చే, అందరూ మెచ్చే ఉస్తా వెస్ట్‌సైడ్ అందుబాటులోకి వచ్చాయి. ఇక పురుషులకు నూన్, వెస్ట్‌స్పోర్ట్, ఆస్కాట్, ఇటిఎ, వెస్ట్‌స్ట్రీట్, ఓక్ అండ్ కీల్ అందుబాటులో ఉన్నాయి. చిన్నారులకు బేబీ హాప్ హాప్, వై అండ్ ఎఫ్, డెనిమ్స్, పోలోట్రీస్, పఫ్ స్లీవ్స్ టీషర్ట్స్ వెస్ట్‌సైడ్ డిడ్స్‌వేర్, అందుబాటులో ఉంటాయి.

## ఇతర కంపెనీల బాటలోనే హుందాయ్

**కార్ల ధరలు త్వరలో పెంపు**

**న్యూఢిల్లీ :** ప్రముఖ కార్ల తయారీ సంస్థ హ్యుందాయ్ కూడా కార్ల ధరలను పెంచనుంది. వచ్చే ఏడాది జనవరి నుంచి 2 శాతం మేర ధరలను పెంచనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఉత్పత్తి వ్యయం పెరగడమే ఇందుకు కారణమని తెలిపింది. ఇప్పటికే నిస్సాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఫోక్స్‌వ్యాగన్, మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, ఫోర్డ్, టొయోటా తదితర కంపెనీలు కార్ల ధరలను పెంచనున్నట్లు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ జాబితాలో హ్యుందాయ్ కూడా చేరింది. ముడి సరకు ధరలు, ఉత్పత్తి వ్యయం పెరుగుదల వల్ల ఇప్పటికే ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నామని, వచ్చే ఏడాది నుంచి 2 శాతం మేర ధరలు పెంచాలని నిర్ణయించామని కంపెనీ సేల్స్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్ రాకేశ్ శ్రీవాస్తవ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం కంపెనీ రూ.3.29 లక్షల ఇయాన్ మొదలుకుని రూ.25.19 లక్షలు విలువైన టస్కన్ వరకు వివిధ శ్రేణుల్లో కార్లను విక్రయిస్తోంది.

# అమలోద్భవి ఒడిలో లోకరక్షకుడు



గాబ్రియేలు దేవదూత నీకు కుమారుడు జన్మిస్తాడని మరియ తల్లికి చెప్పగానే ఎంతగానో కలవరపడ్డారు. అయితే లోకరక్షకుడు నీగర్భాన పుడతాడు అతనికి ఏసు అని పేరుపెట్టాలి అనగానే దేవదేవుని కుమారుడే తన గర్భాన జన్మించబోతున్నాడన్న ఆనందంతో ఎన్నో కలలు, మరెన్నో ఊహలు ఆమెను ఉక్కిరి బిక్కిరి చేశాయి. బహుశ ఈ లోకాలను ఏలే ప్రభువు తన గర్భాన పుట్టడం ఎంత ఆధిక్యత అని మురిసిపోయి ఉంటారు. కరడుగట్టిన ఈ లోకాన ఎలా పెంచాలా అని మధనపడి కూడా ఉంటారు కదా !

హేరోదు రాజు జనాభా లెక్కలకోసం తన ప్రజలందరినీ పిలవడంతో నిండుచూలాలిని (ఆమె భర్త ) యేసేపు గాడిదపై ఎక్కించి బెత్లేహేము నగరానికి తీసుకువెళ్లారు. అక్కడి సత్రాలన్నీ ప్రయాణీకులతో నిండిపోవడంతో ఆమెపై జాలితో సత్రపు యజమాని పశువుల పాకలో ఉండటానికి అనుమతించారు. అక్కడే ఆమె లోకరక్షకుడికి జననం ఇచ్చింది. పశువులపాకలో దివ్యకాంతులు వెదజల్లాయి. మంచి మనస్సులు, మనుషులు ఎక్కడ ఉన్నా వారి సుగంధం, వెలుగులు ప్రసరిస్తూనే ఉంటాయనడానికి అదొక తార్కాణం. అయినా ఆయన కోసం ముగ్గురు పశువుల కాపరులు, ఇంకా ముగ్గురు జ్ఞానులు కూడా ఏతెంచి కానుకలు సమర్పించారు. ఎంత గొప్ప సంఘటన... ! సాదాసీదా పశువుల కాపరులకు దేవదూత లోకరక్షకుడు పుట్టాడని తెలియచేస్తే.. అరుదైన నక్షత్రం ఆకాశంలో పుట్టిందంటే ఎవరో మహామహనీయుడు ఈ లోకంలో పుట్టాడని జ్ఞానులు తమ విజ్ఞానంతో తెలుసుకున్నారు... దేవదేవుడు సామాన్యులకు, విజ్ఞానులకు అందుబాటులో ఉంటాడని ఈ కార్యం ద్వారా అర్ధమవుతుంది.

ఆయన పుట్టింది కూడా ఒక సాదాసీదా వడ్రంగి ఇంట... అంతేగాని ఆగర్భ శ్రీమంతుడి ఇంటకాదు. ఎంత ఆనందంగా బ్రతికాము, ఎంతగా పరులకోసం పాటుపడ్డామన్నది ముఖ్యంకాని ఏ కులాన, ఏమతాన, ఎంత గొప్ప ఇంటిలో పుట్టాము అన్నది ముఖ్యం కాదన్నది తెలియడానికే దేవుడు తన కుమారుడిని ఇలా పంపాడని మనం అర్థం చేసుకోవాలి. చిన్ననాటి నుంచి ఎంతో అణుకువగా,క్రమశిక్షణగా పెరిగిన ఏసు తన యుక్తవయస్సులో బోధనలు చేపట్టగానే తల్లి మరియ ఎంతగానో తల్లడిల్లి ఉంటుంది. ఎందుకంటే లోకరక్షకుడు అంటే కుళ్లు రాజకీయాలను కడిగివేసి, దీనులకు, దీనాత్ములకు అనుదినం అనేక కష్టనష్టాలను ఎదుర్కొంటున్న సామాన్య ప్రజలను ఉద్ధరించడానికి తన కుమారుడు రారాజుగా అవతరిస్తారని ఏసును గురించి ఊహించి ఉండవచ్చు. అయితే ఆయన దీనాత్మకలిగి, విరిగి నలిగిన హృదయం కలవారిని, కుంటి, గుడ్డివారిని, చెదిరిన మనస్సుతో అష్టకష్టాలు పడుతున్న వారిలో ఉజ్జీవాన్ని నింపుతున్న తన కుమారుడిని చూసి ఆయన కిష్టమైన మార్గాన్ని అనుసరించేందుకు ఆమె పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. పిల్లలు ఎదుగుతున్న క్రమంలో ఎదురుదెబ్బలను భరించడానికి తల్లిదండ్రులు తమ సహాయ సహకారాలను అందిస్తూనే ఉండాలి. దేవమాత మరియ చేసిందికూడా అదే. ఆయన మరణం వరకు... ఆమె వెన్నంటే ఉన్నారు. అంతేకాని నామాటే వేదం .. నీవు రాజువు కావాలి.. ఇలాంటివి చేయకూడదు అని ఎప్పుడూ ఆమె ఏసు దారికి అడ్డురాలేదు.

### తల్లిదండ్రుల బాధ్యతలు

ఈనాటి తల్లిదండ్రులు నువ్వు ఫలానా కోర్సే చేయాలి... రిజర్వు బ్యాంకులా ఎప్పుడూ నీదగ్గర కోట్లుండాలి. ఇలాంటి ఊహలతో పిల్లలను విద్యాలయాలనే కార్ఖానాలకు పంపుతున్నారు తప్ప విలువలు కలిగిన విద్యను అందించలేక పోతున్నారు. అందుకే ఒత్తిడి భరించలేక, తమకు ఇష్టంలేని విద్యను చదవలేక, అర్థాంతరంగా తమ జీవితాలను చాలిస్తున్నారు. ఇప్పటికైనా తల్లిదండ్రులు తమ బిడ్డల కలలను, ఆకాంక్షలను అర్థం చేసుకొని వారికి మార్గదర్శకులుగా నిలవాలి. అంతేకాదు జీవితంలో వారు ఒక స్థానానికి చేరేవరకు చేదోడు వాదోడుగా నిలవడానికి మేం నీకు ఉన్నాం.. అనే భరోసాను కల్పించాలి... ఏరంగంలో తమ బిడ్డలు ప్రవేశించినా ఉత్తమ విలువలు పాటించేలా చేయడం తల్లిదండ్రుల బాధ్యత.. అప్పుడే వారు ఉత్తమ సంతానాన్ని ఈ దేశానికి ఇవ్వగలరు... ఉత్తమోత్తమ తల్లిదండ్రులుగా లోకాన నిలుస్తారు.

## నోరూరించే కేకుల తయారీ

నూతన సంవత్సరంలో నోరూరించే కేకులు తయారు చేసి మీ బంధువులు, మిత్రులు, పొరిగింటివారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపండి...











కేకు తయారీకి కావల్సిన పదార్థాలు
మైదా లేదా గోధుమ
పిండి :100 గ్రాములు
పంచదార పొడి : 100 గ్రాములు
కోడిగుడ్లు : 3, వెన్న : 100 గ్రాములు
(ఇది డెయిరీ పార్లల్‌లో దొరుకుతుంది)
లేదా రిఫండ్ ఆయిల్
బేకింగ్ పౌడర్ 1/2 టీ స్పూను

మొదట ఒక స్టీలు పాత్రలో గుడ్లను పగులకొట్టి షుగర్ పౌడర్ వేసి రెండూ ఎగ్‌బీటర్(లేదంటే పప్పుగుత్తి ) తో బాగా కలియ తిప్పాలి. రెండూ బాగా కలిసిన తర్వాత ఆయిల్, జెల్ ,మైదా బేకింగ్ పౌడర్ ( తినే షోడా) వేసి బాగా తిప్పాలి. కొంచెం పాలు కూడా పోయవచ్చు. దానిలో జీడిపప్పు, కిస్ మిస్ వేసుకోవచ్చు. ఈ మిశ్రమాన్ని ఓవెన్‌లో 180 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద 15 నిమిషాలపాటు ఉంచి తియ్యాలి. ఓవెన్ లేని వారు ఒక పెనంపై ఇసుక పోసి బాగా వేడి అయిన తర్వాత దానిపై మనకు ఇష్టమైన పాత్రలు, లేదా కప్పుల్లో సగం వరకు పిండి పోసి మూతలు పెట్టి పావుగంట తర్వాత ఉడికిన వాసన వస్తే తీసి వేయాలి.. లేదంటే పెనం పైన పోసిన ఇసుక వేడైన తర్వాత కుక్కర్‌లో విజిల్ లేకుండా 25 నిముషాలు ఉంచి తీయాలి.

### క్రీమ్ తయారీకి కావల్సిన పదార్థాలు

బట్టర్ : 100 గ్రాములు
ఐసింగ్ షుగర్ : 200 గ్రాములు
రంగు : చిటెకెడు

తయారీ విధానం : వెన్న, ఐసింగ్ షుగర్, చిటెకెడు ఇష్టమైన రంగు ( ఇవన్నీ కేకు తయారు చేసే షాపుల్లో దొరుకుతాయి) బాగా కలియబెట్టాలి. అవసరమనుకుంటే రెండు లేదా మూడు చుక్కలు నిమ్మరసం కూడా కలపండి.

### కేకు తయారీ

మైదా లేదా గోధుమ పిండి 100 గ్రాములు
పంచదార పొడి : 100 గ్రాములు
కోడి గుడ్లు : 2,
పాలు 1/2 కప్పు
వెనీల ఎసెన్స్ :1 టీ స్పూను (కావాలను కుంటే)
ఆల్మండ్ ఎసెన్స్ : 1 టీస్పూను
జీడిపప్పు, బాదం, కిస్‌మిస్, టూటీ ఫ్రూటీ
దాల్చిన చెక్క పౌడర్ : చిటికెడు
జాజికాయ పౌడర్ : 1/2 చిటికెడు
నిమ్మతొక్క (సన్నగా తరగాలి) + నిమ్మరసం కొంచెం
బేకింగ్ పౌడర్ : 1/2 టీస్పూను
బేకింగ్ సోడా 1/2 టీ స్పూను

ఒక పాత్రలో గుడ్లను పగులగొట్టి నురుగు వచ్చేవరకు కలియ బెట్టాలి. వేరే గిన్నెలో పంచదార పొడి, వెన్నలను బాగా కలియబెట్టాలి. వీటిని మొదటి పాత్రలోని మిశ్రమానికి కలపాలి. పైన పదార్థాలను ఒకదాని తర్వాత మరొకటి వేస్తూ కలియబెడుతూ ఉండాలి. దీనిని కూడా ఓవెన్‌లో 200 డిగ్రీల సెంటీ గ్రేడ్ వద్ద 25-30 నిముషాల వరకు ఉంచి తీయాలి లేదా పైన చెప్పిన రీతిలో వేడి ఇసుకపై పెట్టి వండాలి.

- పుష్పాంజలి

# భయంలేని ఒకే ఒక్కడు...







నిజాలను మాట్లాడకుండా మనం మౌనంగా ఉంటే అబద్ధాల పెద్దగొంతుదే నిజమైపోతుంది. అందుకే నేను మాట్లాడాలనుకుంటున్నా అని నిర్భయంగా గొంతుసవరించిన విలక్షణ నటుడు ప్రకాష్ రాజ్ ఒక్కడే .. సమాజంలో పేరు, ప్రఖ్యాతులు, ఉన్నత స్థితి, అనేక సౌకర్యాలు మీనుంచి అంటే ఈ సమాజం నుంచి పొందిన మేమంతా మాట్లాడకపోవడం బాధ్యతా రాహిత్యమవుతుందన్న నిజాయితీ ఆయన సొంతం. రాజస్థాన్‌లో అనేక మందిని గోహత్య పేరుతో హత్యలు చేయడంపై ఆయన ప్రశ్నించారు. హిందుత్వం- జాతీయ తత్వం ఒక్కటే ఎలా అవుతుందని సనాతనవాదులను నిలదీస్తున్నారు. ఏరాజకీయా అండతో నేను ప్రశ్నించడంలేదని ఈ సమాజంలో ఒక్కరిగా మాత్రమే మాట్లాడుతున్నానన్నారు. అంతే కాదు నాకు స్క్రిప్టులు, సెట్టింగ్‌లతో రాలేదని ఇప్పుడు నిజాలు తెలిసి మాట్లాడకపోతే రానున్న తరంలో ఆలోచించడానికి కూడా భయపడతారని జనాన్ని జాగృతం చేస్తున్న యావత్ భారత సినిమా పరిశ్రమలో ఒకే ఒక్కడు ప్రకాశ్‌రాజ్. కర్ణాటకాలో దుండగుల కాల్పుల్లో మరణించిన జర్నలిస్టు గౌరీలంకేష్ హత్యపై కూడా ప్రశ్నించి తాను కేవలం డబ్బులు తీసుకొని నటించడమేకాదు... గొంతుకూడా సవరించగలనన్న దమ్మున్న వాడినని ఆయన రుజువు చేసుకున్నారు. గుజరాత్, హిమాచల్ ప్రదేశ్‌ల్లో గెలుపు సొంతం చేసుకోవడం సంతోషంగా ఉందా అంటూ 'జస్ట్ ఆస్కింగ్' పేరుతో మోడీని ఉద్దేశించి ట్వీట్ చేశారు.

దీంతో మందిమార్బలం ఉండి పరిశ్రమను ఆక్టోపస్‌లా చుట్టేసిన వారంతా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అంతేకాదు ఎక్కడ ఆయన రియల్ హీరో అయిపోతాడో అంటూ పరిశ్రమలోని కొందరిని ఆయనపైకి ఉసిగొల్పుతున్నారు. అందుకు ఉదాహరణే ఒక నిర్మాత ప్రకాశ్‌రాజ్‌పై నిప్పులు కురిపిస్తూ ప్రొడ్యూసర్లను , రైటర్లను ఇబ్బందిపాలు చేస్తున్న నువ్వు హెడ్‌లైన్‌ల్లో ఉండటానికే ఈ తరహా ప్రశ్నలు వేస్తున్నావంటూ విమర్శించారు. అదే నిజమైతే నిర్మాతలు, రచయితలు ఆయన్ను ఎందుకు భరిస్తున్నట్లు ? సమస్యలపై పోరాటం చేయి అన్నారు.. ఇప్పుడు ఆయన చేస్తుందేమిటను కుంటున్నారో సదరు నిర్మాత.. చిత్రపరిశ్రమకు చెందిన చాలా మంది షూటింగ్‌లో ఖాళీ ఉన్నప్పుడల్లా వెళ్లి అధికార పెద్దలను కలసి కాళ్లకు నమస్కారం చేసి ఆశీర్వాదం చేసుకుంటూ పబ్బం గడుపు కుంటున్నవారే.. యువత ఈ విషయాలపై సమగ్రంగా ఆలోచించాలి. ప్రకాష్‌రాజ్ లాంటివారి నుంచి స్ఫూర్తి పొందితే భవిష్యత్‌లో భయంలేని సమాజంలో బ్రతుకుతామన్న భరోసా ఉంటుందని గుర్తించాలి.

- బోస్





ఓం శ్రీ సాయిరాం రిజిస్ట్రేషన్ కన్సల్టెన్సీ & సర్వీసెస్

ఇళ్లు, ఇళ్ల స్థలములు, సీఆర్‌డీఏ ప్లాట్లు, పొలములు రిజిస్ట్రేషన్ చేయించబడును. మార్టిగేజ్ బాండ్లు,అఫిడవిట్, అగ్రిమెంట్లు నోటరీ చేయబడును. దస్తావేజు స్టాంపులు అమ్మకంతోపాటు అన్ని రకముల దస్తావేజులు వ్రాయబడును, మోటారు వాహనములకు ఇన్సూరెన్స్ చేయబడును. కంప్యూటర్ వర్క్ మా ప్రత్యేకత

అడ్రస్ : రాయపూడి మెయిన్ రోడ్
నిమ్మకాయల సెంటర్,
గోపి గోపిక రెడిమేడ్స్ ప్రక్కన
(అమరావతి),
ఫోన్ : 95024 24704 , 97052 99487























Printed & Published by Shri Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor Shri Pattan Hussain Khan. RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2016-18, Cell 9440662699, Email : info@rajadhanivartalu.com